

సూర్య
తెలుగు దినపత్రిక
www.suryaa.com

మహబూబ్‌నగర్
నాగర్‌కర్నూల్
జోగులాంబగద్వాల్
నారాయణపేట
వనపర్తి

గురువారం 2 అక్టోబరు 2025 పేజీలు 8


# విజయాల విజయదశమి

## - ధర్మం నడిచే దారి దసరా పర్వదినం



**వనపర్తి సూర్యన్యూస్:** అశ్వయుజ శుద్ధ దశమి హిందూ పంచాంగంలో అత్యంత పుణ్యదినాల్లో ఒకటి. దేశమంతా ఘనంగా జరుపుకునే విజయదశమి పండుగకు భిన్నమైన ప్రాంతాల్లో భిన్నమైన పరంపరలున్నా, అంతర్లీనంగా ఒక్కే సందేశం ధర్మమే గెలుస్తుంది, బలానికంటే న్యాయం గొప్పది అనే విషయం. దేవీ శక్తి ప్రబలమైంది దసరా అంటే తొమ్మిది రోజుల నవరాత్రుల ముగింపు. ఈ తొమ్మిది రోజులు అమ్మవారు దుర్గ, లక్ష్మి, సరస్వతిగా భక్తుల కోసం విభిన్న రూపాల్లో దర్శనమిస్తారు. నవరాత్రుల ఉత్సాహం విజయదశమి నాడు తారాస్థాయికి చేరుతుంది. అమ్మవారి అలంకారాలు, హోమాలు, భజనలు, శోభాయాత్రలు ప్రతిఊరు పండుగ జోష్‌తో మార్మోగిపోతుంది. శ్రీరాముడు రాక్షస సంహారం ఇది శ్రీరాముడి విజయం కూడా. సీతమ్మను అపహరించిన రావణునిపై విజయాన్ని సాధించిన రోజే ఇది. అందుకే ఈ రోజును అసత్యంపై సత్యం గెలిచిన రోజు"గా భావిస్తారు. అంతే కాక, మహిషాసురుడిని సంహరించిన దుర్గాదేవి కథ కూడా ఇదే సందర్భంలో గుర్తుకు తీసుకురావాలి. అక్షరారంభానికి ఆదర్శ దినం ఈ రోజు పిల్లలకు అక్షరాభ్యాసం చేయించేందుకు చాలా మంచి దినంగా పరిగణించబడుతుంది. కలము పట్టిన చిన్నారి జీవితంలో విజ్ఞానం పదును పెట్టే ప్రారంభమే ఇది. విద్యార్థులు తమ పుస్తకాలు, పాఠ్యసామగ్రిని పూజించి, కొత్త శ్రద్ధతో చదువును ప్రారంభిస్తారు. ప్రజల కలబోత %-% పల్లెల్లో పండుగ సందడి తెలంగాణలో బతుకమ్మ ముగింపు రోజైన సద్దుల బతుకమ్మ వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతాయి. ఆడపడుచుల కళలు, పాటలు, పూలతో మమేకమై ఊరంతా ఒకే రంగులో కళకళలాడుతుంది. ఆంధ్రలో అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, ఊరేగింపులు, సంప్రదాయ క్రీడలతో పండుగ రంజుగా మారుతుంది. ఈ వేడుకలు కేవలం భక్తి మాత్రమే కాదు... మనమందరం ఒకటిగా కలిసికట్టుగా ఉండాలన్న సందేశాన్ని ఇస్తున్నాయి. సమాజంలో చెడును నశింపజేసే శక్తిని మనందర్లో నూరిపోసే అవకాశం ఇది దసరా అంటే విజయం, విశ్వాసం, విభిన్నతలో ఐక్యత. ఇది మన సంస్కృతిలో నాటుకున్న శాశ్వత విలువలకు పండుగ. జీవితంలో ప్రతి ఒక్కరు తమ సమస్యలపై విజయం సాధించాలని కోరుకునే ఈ పర్వదినం అందరికీ శక్తినిస్తుంది, శాంతినిస్తుంది

***– బి.గోపాల్ వనపర్తి సూర్య న్యూస్***






# ఆగ్రో రైతు సేవా కేంద్రం తనిఖీ చేసిన కలెక్టర్



**చిన్నచింతకుంట సూర్యన్యూస్:** మండలకేంద్రంలో ఆగ్రో రైతు సేవా కేంద్రం-2 ను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి బుధవారం తనిఖీ చేశారు యూరియా, ఎరువుల స్టాక్ రిజిస్టర్ పరిశీలించారు,పంపిణీ సక్రమంగా జరుగుతుందా తెలుసుకున్నారు. రైతులకు యూరియా ఇబ్బంది లేకుండా సరఫరా చేయాలని సూచించారు. ఆగ్రో రైతు సేవా కేంద్రం ద్వారా యూరియా, ఎరువులు, విత్తనాలు, పురుగుమందులకు కచ్చితంగా రైతులకు రసీదులు ఇవ్వాలని స్పష్టం చేశారు. యూరియా కొరత లేదని ఎప్పటికప్పుడు కొరత లేకుండా రైతులకు ఆగ్రోస్ కేంద్రాల ద్వారా అందించడం జరుగుతుందని పేర్కొన్నారు, జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్, తహసీల్దార్ కె ఎల్లన్న మండల వ్యవసాయ అధికారి రాజేష్ ఖన్నా, మండల గిర్దవర్ లు తిరుపతయ్య అహ్మద్ అమీర్ తదితరులు ఉన్నారు




## నిరుపేద విద్యార్థిని జోన రేచల్‌కు ఎంబీబీఎస్ సీటు



**చిన్నచింతకుంట, సూర్యన్యూస్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించిన నీట్ పరీక్ష ఫలితాల్లో చిన్నచింతకుంట మండల కేంద్రానికి చెందిన సి సామేలు రహేలమ్మ దంపతుల కుమార్తె సి జోన రేచల్ ప్రభుత్వ కోటాలో ర్యాంకు సాధించి రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పట్నం మహేందర్ రెడ్డి మెడికల్ కాలేజీ ఇనిస్టిట్యూట్ లో ఎంబిబిఎస్ సీటు సాధించింది తల్లిదండ్రులు కూలి పనులు చేస్తూ జోన రేచల్ ను కష్టపడి చదివించారు తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి జోన రేచల్ కష్టపడి చదివి ఎంబిబిఎస్ సీటు సాధించడం పట్ల గ్రామస్తులు యువకులు హర్షం వ్యక్తం చేశారు అదేవిధంగా ఇష్టంతో కష్టపడి మన మండల కేంద్రంలో కూడా విద్యార్థులు మరెన్నో విజయాలు సాధించాలని ప్రశంసించడం జరిగింది జోన రేచల్ ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు మరింత ముందుకు సాగాలని సూచించారు పట్టుదలతో చదివి మంచి ఉత్తీర్ణత సాధించి ఉత్తమ డాక్టర్ గా రాణించి గ్రామానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు కోర్సును పూర్తి చేసి డాక్టర్ గా రానించి పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని గ్రామస్తులు యువకులు తెలిపారు

## జాతీయ స్థాయి రోయింగ్ పోటీలకు ఎంపిక




**మాగనూర్ సూర్య న్యూస్ :** మండలంలోని వడ్వాట్ గ్రామానికి చెందిన తల్వార్ నర్సింహ కీ"శే నర్సమ్మ కుమారుడు ఉపేంద్ర హైదరాబాద్ హుస్సేన్ సాగర్ లో రోయింగ్ పడవ క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం పొంది ఖేలో ఇండియా, జాతీయ స్థాయి రోయింగ్ పోటీలకు ఎంపికైనట్లు ఉపాధ్యాయులు బి.దీప బుధవారంఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలో నాలుగవ తరగతి చదువుతున్న దశలో ఉపేంద్ర క్రీడా స్ఫూర్తిని గమనించి మక్తల్ స్టేడియం గ్రౌండ్లో వేసవి క్రీడ శిక్షణ శిబిరంలో విశ్రాంత పిఈటి గోపాలం దగ్గర మెరుగైన శిక్షణ ఇప్పించిన్నట్లు తెలిపారు. ఆనంతరం హక్కింపేట క్రీడా పాఠశాలలో 7తరగతి చదువుతూ జాతీయ స్థాయికి ఎంపికై అక్టోబర్ 11 నుంచి 17 వరకు కేరళ రాష్ట్రంలోని అల్లపూజహా సరస్సులో జరిగే ఖేలో ఇండియా రోయింగ్ క్రీడా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ప్రస్తుతము ఉపేంద్ర హైదరాబాదులో కోచ్ హేమంత్ దగ్గర మెరుగైన శిక్షణ పొందుతున్నాడని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఉపేంద్ర క్రీడల్లో రాణించి అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రదర్శించాలని బి దీప ఆకాంక్షించారు. ముఖ్యంగా ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా నుంచి రోయింగ్ క్రీడల్లో ఉపేంద్ర జాతీయస్థాయిలో పాల్గొనడం మొదటిసారి అని ఆనందం వ్యక్తం చేశారు.

## ఊట్కూర్‌లో ప్రమీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం



**ఊట్కూర్ సూర్య న్యూస్ :** మండల కేంద్రంలోని ఓంనగర్ కార్గిల్ చౌరస్తాలో బుధవారం ఉదయం ప్రమీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు కోరం మహేష్ మాట్లాడుతూ "పరిశుభ్రత వలన ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుంది. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి" అని పిలుపునిచ్చారు. తరువాత సభ్యులు, స్థానిక పెద్దలు, యువకులు కలిసి చౌరస్తా వీధులను శుభ్రం చేసి చెత్తను తొలగించారు. అలాగే శ్రీ ఆంజనేయ స్వామి గుడి వద్ద మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించడమే కాక కాలుష్య నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని సూచించారు. కార్యక్రమంలో ప్రమీల ఫౌండేషన్ సభ్యులు, ఓంనగర్ పెద్దలు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ప్రిసైడింగ్ ఆఫీసర్లకు శిక్షణ



**కృష్ణ సూర్యన్యూస్:** మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంచార్జీ ఎంపీడీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్లుగా నరేందర్, నాగభూషణ్ వ్యవహరించి త్వరలో జరగబోయే జెడ్పీటీసీ, ఎంపీటీసీ,గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు నిర్వర్తించవలసిన విధులు, ఎన్నికల నియమావళి, ఎన్నికల ప్రక్రియలో సక్రమంగా బాధ్యతలు నిర్వహించాలని పలు సూచనలు సలహాలు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిసైడింగ్, అసిస్టెంట్లు, ప్రిసైడింగ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## వడ్డేపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఎన్నికల సన్నాహక సమావేశం



**అలంపూర్ సూర్య న్యూస్ :** జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండల కేంద్రంలో ఏఐసీసీ కార్యదర్శి మాజీ శాసనసభ్యుడు డాక్టర్ సంపత్ కుమార్ ఆదేశాల మేరకు స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మండల పార్టీ కాంగ్రెస్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి అధ్యక్షతన బుధవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆశావాహులతో కలసి కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసారు. ఆయా గ్రామాల రిజర్వేషన్లు దృష్టిలో ఉంచుకొని ఎంపీటీసీ జడ్పిటిసి స్థానాలకు మరియు సర్పంచ్ స్థానాలకు కావలసిన నాయకులను గుర్తించి వారి వారి అభిప్రాయాలను సేకరించి అలంపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పెద్దలైన సంపత్ కుమార్ దృష్టికి తీసుకెళ్లే కార్యక్రమం ఈరోజు రామకృష్ణారెడ్డి చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజలకు కావలసిన సంక్షేమ పథకాలను సమర్ధవంతంగా అందిస్తున్నది కనుక ప్రతి ఒక్క కార్యకర్త ప్రజల దృష్టికి తీసుకెళ్లి ప్రజా పాలన ప్రభుత్వ ఉద్దేశాన్ని వివరించి అన్ని స్థానాలలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించే దిశగా ప్రయత్నం చేయాలని ఉపదేశించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాజీ ఆర్డిఎస్ చైర్మన్ తనగల సీతారాం రెడ్డి, జిల్లా కిసాన్ శాల అధ్యక్షుడు ఎనుముల నాగరాజు, కొంకల యోగి రెడ్డి సత్య ప్రసాద్ రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి లక్ష్మీపతి ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎల్లప్ప గట్టన్నా శ్రీనివాస్ రెడ్డి తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లా ప్రజలకు విజయ దశమి దసరా శుభాకాంక్షలు : జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు



**గద్వాల సూర్యన్యూస్ :** దుష్ట శక్తులపై విజయానికి సంకేతముగా జరుపుకునే దసరా పండుగను స్ఫూర్తిగా తీసుకొని ప్రజలందరు ఐక్యత, సమగ్రతల కోసం కృషి చేయాలని దసరా పర్వదినం సందర్భంగా జిల్లా పోలీసుశాఖ తరపున జిల్లా ప్రజలకు, పోలీసు అధికారులకు, సిబ్బందికి జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు ఐపీఎస్ విజయదశమి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ విజయదశమి ప్రజల జీవితాల్లో తేజస్సు, విజయాన్ని తేవాలని ఆకాంక్షిస్తూ. పండుగా ఉత్సవాలు నిర్వహించు కునేవారు సంతోషకరమైన వాతావరణంలో, ఆరోగ్యకరంగా అందరూ కలిసిమెలిసి సోదరాభావంతో ఉత్సవం నిర్వహించుకోవాలని కోరారు. పోలీసుశాఖలో ప్రతి అధికారి ప్రజా రక్షణలో అగ్రగామిగా ఉండి, శాఖ గౌరవాన్ని మరింత పెంచే విధంగా పనిచేయాలని సూచించారు. పండుగలను అందరూ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, ముఖ్యంగా నవరాత్రుల అనంతరం జరిగే దుర్గామాత విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలను కూడా శాంతియుతంగా నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ కోరారు.

## బిజ్వారంలో ఘనంగా దుర్గాదేవి మంత్రాలతో దసరా పండగ జరుపుకుంటారు

### - కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు బి నారాయణ



**మల్దకల్ సూర్య న్యూస్:** హిందువులు అత్యంత పవిత్రంగా జరుపుకునే పండుగల్లో (దసరా) విజయ దశమి ఒకటి. ఈ పర్వదినాన్ని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు అందరు కలిసి సంబురంగా జరుపుకుంటారని కాంగ్రెస్ పార్టీ డైనమిక్ లీడర్ బి. నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా రోజు రాముడు రవణుడిని, దుర్గాదేవి మహిషాసురుడిని సంహరించడం ద్వారా ధర్మాన్ని రచించారని నమ్మకం, చెడుపై ఎల్లప్పుడూ మంచే నెగుతుందని నమ్ముతూ ఈ పండుగ జరుపుకుంటారు. ఈ క్రమంలో బంధుమిత్రులకు దుర్గాదేవి మంత్రాలతో శుభాకాంక్షలు తెలిపారు. దసరా పండుగ వేళ దైవిక శ్రీ శక్తి స్వరూపంగా దుర్గాదేవి అమ్మవారిని పూజిస్తారు. కనకదుర్గమ్మ అమ్మవారిని పూజించడం వల్ల రక్షణ, బలం, జ్ఞానం లబ్ధిస్తాయని బలంగా నమ్ముతారు. దసరా నవరాత్రులు వచ్చాయంటే దుర్గాదేవి నమస్మరణలో మునిగిపోతారు. కొంతమంది భక్తులు దుర్గ దేవి మాల సైతం ధరిస్తారు. జీవితంలో ఎదురయ్యే అన్ని అడ్డంకుల నుంచి విముక్తి పొందేలా చేయమని అమ్మవారిని వేడుకుంటూ... దుర్గ దేవి మంత్రాలు పఠిస్తారు. నేడు దసరా పండుగ జరుపుకోనున్నారు. ఈ పండుగ వేళ మీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు దేవి మంత్రాల రూపంలో శుభాకాంక్షలు తెలిపారు.

## చెడు మీద నిత్యం పోరాటం చేస్తూ మంచి దిశగా సాగడమే విజయదశమి : మాజీ ఎంపీపీ సత్యా రెడ్డి



**మల్దకల్ సూర్య న్యూస్ :** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు మాజీ ఎంపీపీ సత్యా రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి తనలోని చెడు మీద సత్ నిత్యం పోరాటం చేస్తూ మంచి దిశగా విజయం సాధించాలనే జీవన తాత్వికతను విజయదశమి మనకు తెలియజేస్తుందన్నారు. దసరా రోజు శుభ సూచకంగా పాలపిట్టను దర్శించి శమీ వృక్షానికి పూజ చేసి, జమ్మి ఆకును బంగారంలా భావించి పెద్దలకు సమర్పించుకుని వారి ఆశీర్వాదం తీసుకోవడం ఆచారమని ఆయన గుర్తు చేశారు.

## అయిజ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆయుధ పూజ



**ఐజ సూర్య న్యూస్ :** జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణం లోని స్థానిక పోలీస్ స్టేషన్ లో బుధవారం పోలీస్ వారి వాహనాలకు మరియు వారి యొక్క సమూహా వాహనాలకు ఆయుధ చండీ గౌరీ మాత పూజ కార్యక్రమం నిర్వహించడం జరిగింది అని సబ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. అలాగే ఆయన మాట్లాడుతూ నవ అవతారాల్లో మహిషాసుర మర్దిని మహా ఉగ్రరూపంగా భావిస్తాము, అశ్వీజ శుద్ధ ఆయుధపూజను నవమి రోజు ఆయుధపూజను నిర్వహిస్తారు. అమ్మవారు సింహాసనాన్ని అధిష్టించి ఆయుధాలు ధరించిన, ఉగ్రరూపాన్ని దర్శిస్తే విజయం లభిస్తుందని, అందుకు ఈరోజు ఆయుధాలను పూజించి, సకల కార్యాల్లో విజయం లభించాలని అమ్మవారిని కోరుకోవడం జరుగుతుంది అని అన్నారు. ఐజ పట్టణ పోలీస్ స్టేషన్లో ఆయుధ పూజలు నిర్వహించి, కార్యక్రమాన్ని పట్టణానికి చెందిన పురోహితులు చక్రవర్తి ఆచార్యులు ఘనంగా నిర్వహించాము అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐజ పోలీస్ అధికారులు ఉన్నారు.

## ఐజ మండలంలోని వివిధ గ్రామాలలో స్నేహ గ్రామసభ అవగాహన కార్యక్రమం



**ఐజ సూర్య న్యూస్ :** జోగులాంబ గద్వాల్ జిల్లా ఐజ మండల పరిధిలోని వివిధ గ్రామాలలో దసరా సందర్భంగా స్నేహ సభ ఏర్పాటు చేసి జడి దొడ్డి, ఉప్పల గ్రామల పిల్లలకు వివిధ బహుమతులు అందజేయడం జరిగిందని అధికారులు అన్నారు. స్నేహగ్రామసభ వివరాలు ఇలా ఉన్నాయి గ్రామాలలో కిశోర బాల బాలికలు ఎవరైతే ఉన్నారో వారందరికీ ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ పథకాల అవగాహనతో పాటు వారికి బాలల హక్కుల గురించి మరియు ప్రభుత్వం నుండి వచ్చే స్కాలర్షిప్స్‌ను అంధచేయడం గురించి గ్రామ పిల్లలతో పాటు వారి తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమంలో భాగంగా ఈ స్నేహ గ్రామ సభను జెడిదొడ్డి మరియు ఉప్పల గ్రామాల్లో ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలతో పాటు పిల్లలు అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వత్తుగుండ్లలో మహిషాసురమర్ధిని అవతార దర్శనం

**దామరగిద్ద సూర్యన్యూస్:** మండల పరిధిలోని బుధవారం దేవి నవరాత్రి వేడుకలు ఘనంగ నిర్వహించారు. వత్తుగుండ్లలో యువ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం ముందు మహిళా ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారు మహిషాసుర మర్ధిని రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు.మంటపం ముందు మహిళలు బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు.అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలి అని మహిళలు వేడుకున్నారు.

## భవానీ దేవాలయంలో కాళికాదేవి అవతార దర్శనం

**ఊట్కూర్ సూర్య న్యూస్ :** మండల కేంద్రంలో దేవీ నవరాత్రి వేడుకలలో భాగంగా స్థానిక భవానీ దేవాలయంలో బుధవారం పదవరోజు అమ్మవారు కాళికాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అలంకరణలు నిర్వహించగా, ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. వేడుకల్లో ఎస్ఎస్‌కె సమాజ్ అధ్యక్షులు అశోక్ కుమార్ చౌదరి, ఉపాధ్యక్షులు రాధా ప్రకాష్, సభ్యులు పాల్గొన్నారు.

## కొల్లూరు గ్రామంలో మదాసి - మదారి కురువ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక



**ఊట్కూర్ సూర్య న్యూస్:** నారాయణపేట గొర్ల సంఘం అధ్యక్షుడు తంగిడి నాగరాజు ఆధ్వర్యంలో బుధవారం మండల పరిధిలోని కొల్లూరు గ్రామంలో మదాసి మదారి కురువ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కులజలు శ్రీనివాస్, మక్తల్ నియోజకవర్గ సంఘం అధ్యక్షుడు అంజప్ప, ఊట్కూరు ఆశప్ప, పెద్దపొర్ల లింగప్ప, నారాయణపేట తాలూకా అధ్యక్షుడు హనుమంతు, కొల్లూరు లింగప్ప, భీమ్మప్ప, మక్తల్ మండల అధ్యక్షుడు కురువలింగం, పులిమామిడి గజలప్ప, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. ఎన్నికలలో జబ్బురు మల్లప్ప అధ్యక్షుడిగా, గడ్డం మల్లప్ప ఉపాధ్యక్షుడిగా, ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామస్తులు కొత్తగా ఎన్నికైన కమిటీకి అభినందనలు తెలిపారు.

## పోలింగ్ సిబ్బందికి మొదటి విడత శిక్షణ - ఎంపీడీవో శంకర్ నాయక్



**చారకొండ, సూర్య న్యూస్.** స్థానిక సంస్థల జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచులు, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో అధికారులకు పోలింగ్ సజావుగా జరిగే విధంగా మొదటి విడత శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి మండల స్పెషల్ ఆఫీసర్ జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్వో) రఘునందన్ రావు, సర్పంచు ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్లు తహసీల్దార్ అద్దంకి సునీత, మొడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఆఫీసర్లు ఎంపీడీవో శంకర్‌నాయక్, ఎంపీవో నారాయణ హాజరయ్యారు. మండల స్పెషల్ ఆఫీసర్ జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల రిటర్నింగ్ ఆపీసర్ రఘునందన్ రావు మాట్లాడుతూ పోలీం గ్ నిర్వహణపై ప్రిసైడింగ్ ఆఫీసర్లు (పీవో)లకు 35 మందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. మండలంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు 41, సర్పంచు, వార్డు సభ్యుల స్థానాలకు 142 పోలింగ్ కేంద్రాలను ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీవో శంకర్ నాయక్ తెలిపారు.

## రామ్‌రెడ్డిపల్లిలో ఘనంగా దుర్గామాత ఉత్సవాలు



**తెలకపల్లి సూర్య న్యూస్ :** తెలకపల్లి మండలం పరిధిలోని రాంరెడ్డిపల్లి గ్రామంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం పదవరోజు అమ్మవారికి శ్రీ మహిషాసుర మర్దిని రూపంలో పూజా కార్యక్రమం నిర్వహించడం జరిగింది బుధవారం పూజా కార్యక్రమం నిర్వహించినవారు ఎర్రంశెట్టి చంద్రశేఖర్- భాగ్యశ్రీ దంపతులు. ఇట్టి పూజా కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ విరివింటి శ్రీకాంత్ శర్మ సమక్షంలో నిర్వహించడం జరిగింది. రాంరెడ్డిపల్లి గ్రామపెద్దలు దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు యువకులు, మహిళామణులు అందరూ పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## తెలకపల్లి ప్రధాన చౌరస్తా గుంతల పూడ్చి వేత



**తెలకపల్లి సూర్య న్యూస్ :** తెలకపల్లి మండల కేంద్రం ప్రధాన చౌరస్తాలో బంద్రీ వారం పంచాయతీ కార్యదర్శి భాస్కర్ ఆధ్వర్యంలో డోజర్ యంత్రంతో గుంతల పూడ్చివేత కార్యక్రమం నిర్వహించారు, కొంత కాలంగా వర్షాల కారణంగా ఏర్పడిన గుంతలతో వాహనదారులు, ప్రజలురాకపోకలకు తీవ్ర అసౌకర్యానికి గురవుతూ ఇబ్బందులు పడుతున్నారు, సమస్య తీవ్రత దృష్ట్యా స్పందించిన కార్యదర్శి తాత్కాలికంగా గుంతల మరమత్తు చేపట్టారు, గుంతల్లో మొరం మట్టి తరలించి పటిష్టమైన మరమ్మతులు చేపట్టాలని, అదే విధంగా బస్టాండ్ ఆవరణలోని గుంతలను కూడా మరమ్మతి తరలించి తగిన మరమ్మతుల ద్వారా గుంతలను పూడ్చాలని, ప్రయాణికులు, ప్రజలు కార్యదర్శిని కోరుతున్నారు.

# ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలి : మండల అధికారులు



**నవాబుపేట్ సూర్య న్యూస్:** స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మండల వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఖచ్చితంగా పాటించాలని తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో జయరాం నాయక్, ఎస్ఐ విక్రమ్ లు అన్నారు.మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్, వార్డు స్థానాల ఎన్నికల నిర్వహణపై బుధవారం అధికారులు, గుర్తింపు కలిగిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినందున అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. మండలంలో 1జడ్పీటీసీ,15ఎంపీసీటీ స్థానాలు, 42గ్రామ పంచాయతీలు, 354వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికల సంఘం ఎన్నికల కార్యాచరణ విడుదల చేసిందని తెలిపారు. ఎన్నిక ప్రవర్తన నియమావళి పకడ్బందీగా అమలు చేయాలని అన్నారు. నగదు, అక్రమ మద్యం, చీరల పంపిణీ, ఓటర్లను ప్రభావితం చేసే వస్తువుల పంపిణీ చేస్తే చర్యలు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని వివిధ రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# బీజేపీ కార్యాలయంలో సేవాపక్షంలో భాగంగా మేధావుల సదస్సు



**గద్వాల సూర్యన్యూస్:** జోగులాంబ గద్వాల జిల్లా డీకేబంగ్లా బిజెపి కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు ఆధ్వర్యంలో సేవ పక్షంలో భాగంగా మేధావుల సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి భరత్ ప్రసాద్ హాజరై మాట్లాడుతూ స్థానిక ఎన్నికలలో బిజెపి కార్యకర్తలు చురుగ్గా పాల్గొని,ఎన్నికలలో గెలిచి ప్రజలకు అంకితభావంతో సేవ చేయాలని అన్నారు. అలాగే మన ప్రధాని మోదీ గారు మొదలుపెట్టిన స్వదేశీ ఉద్యమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములై స్వదేశీ ఉత్పత్తులనే వాడాలని సూచించారు. జిఎస్టి వస్తు సేవల పన్ను, టాక్స్ 2 స్లాబులు పూర్తిగా రద్దు చేయడంతో పాటు సామాన్యమైన ప్రజలకు నిరుపేదలకు అందరికీ సౌలభ్యమైన విధముగా జీఎస్టీ తగ్గియడంతో స్లాబ్స్ 5%,18%, దేశం మొత్తం 28 రాష్ట్రాలకు 8 కేంద్రపాలిత ప్రాంతాలకు ఒకే విధమైన జి ఎస్ టి స్లాబులను ఏర్పాటు చేయడంతో మోడీ గారికి అభినందనలు తెలియజేస్తూ స్వదేశీ ఉత్పత్తులని వాడాలని సూచించారు. ప్రజలు భారతీయ జనతా పార్టీ వైపు చూస్తున్నారని ప్రతి ఎంపీటీసీ జెడ్పిటిసి స్థానాలకు బిజెపి పార్టీ నుండి ఎక్కువ మొత్తంలో పోటీదారులు ఉన్నారు. ఒక్కొక్క స్థానానికి ముగ్గురు ఐదు మంది వరకు పోటీదారులు ఉండడం చాలా సంతోషం, ఎందుకంటే ఈరోజు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలని ఒక్క పథకాన్ని కూడా నెరవేర్చలేదు. కాంగ్రెస్ ను పార్టీ నాయకులను పార్టీ పథకాలను చూసి ఓటు వేసే వ్యక్తి లేడు. గతంలో టిఆర్ఎస్ 10సంవత్సరాలు పాలించి కుటుంబం అవినీతి తప్ప రాష్ట్రంలో ప్రజలకు చేసిన పథకాలు వాళ్ళు చేసిన సంక్షేమ పథకాలు ఎలాంటివి కూడా జనాలకు అందలేదు. కాబట్టి రాబోయే స్థానిక ఎంపిటిసిలు జడ్పిటిసి స్థానాలను కచ్చితంగా బిజెపి పార్టీ గెలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల ఇంచార్జి రామచంద్ర రెడ్డి,రాష్ట్ర కౌన్సిల్ మెంబర్లు బండల వెంకట రాములు, అక్కల రమాదేవి,జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్ రావ్, కే కే. రెడ్డి,జిల్లా జీఎస్టీ కన్వీనర్ బలిగేరా శివా రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెం దొడ్డి వెంకటేశ్వర రెడ్డి,పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ, జిల్లా కార్యదర్శి మంజుల నరసింహ శెట్టి తదితరులు ఉన్నారు.

# స్థానిక ఎన్నికల్లో సిపిఎం పోటీకి సిద్ధం

**- స్థానిక ఎన్నికల సన్నాహక సమావేశం**
**- 30 ఎంపీటీసీ స్థానాలు ఏడు జడ్పిటిసి స్థానాల్లో సిపిఎం పోటీ**
**- సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తీగల సాగర్**



**అచ్చంపేట మేజర్ న్యూస్:** స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఎం పోటీకి సిద్ధంగా ఉందని 30 ఎంపీటీసీ స్థానాలు ఏడు జడ్పిటి స్థానాల్లో సిపిఎం పోటీ చేస్తుందని సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తీగల సాగర్ అన్నారు. నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట పట్టణంలో సిఐటియు కార్యాలయంలో సిపిఎం పార్టీ జిల్లా జిల్లా కమిటీ కమిటీ సభ్యుల మరియు మండల కార్యదర్శిల సమావేశం దేశనాయక్ అధ్యక్షతన నిర్వహించిన ఎన్నికల సన్నాక సమావేశంలోసిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తీగల సాగర్ మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎంపీటీసీ జడ్పిటిసి, గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు కార్యకర్తలు సిద్ధం కావాలన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ఎర్ర జెండాకు ప్రజలు మద్దతుగా నిలవాలని పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. ప్రశ్నించే ఎర్రజెండా నాయకులను గెలిపించుకుంటే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజులేని పోరాటం నిర్వహిస్తున్న సిపిఎం ఎర్ర జెండాకు ఎన్నికల్లో మద్దతు తెలిపి అత్యధిక స్థానాలను గెలిపించాలని పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను గాలికి వదిలేసి రాజకీయ లబ్ధి పొందినందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని డిమాండ్ చేశారు. అధిక వర్షాలు భారీ వర్షాల వలన నష్టపోయిన రైతాంగానికి పంట నష్ట పరిహారం ఇచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వరధం పర్వతాలు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.శ్రీనివాస్, బి ఆంజనేయులు, శ్రీ ఆంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు మల్లయ్య, ఎం శంకర్ నాయక్, పరశురాములు, చింతల నాగరాజు, బాలస్వామి, శివ వర్మ, వర్ధన్ సైదులు, మల్లేష్, తరసింగ్, మధు, రవి, శ్రీనివాస్, దశరథం, నిర్మల పాల్గొన్నారు.

# ఉప్పునుంతలలో స్థానిక సంస్థల ఎన్నికల శిక్షణ కార్యక్రమం



**ఉప్పునుంతల, సూర్యన్యూస్:** మండలంలోని రైతు వేదిక కార్యాలయంలో మంగళవారం స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అచ్చంపేట ఆర్డీవో కే మాధవి , ఎంపీడీవో బి. మోహన్ లాల్, మండల ప్రత్యేక అధికారి (ఏడిఏ సర్వేయర్) నాగేందర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పిఓలకు ఎన్నికల నిర్వహణ, ఓటింగ్ విధానం, అధికారుల బాధ్యతలు వంటి అంశాలపై విపులంగా శిక్షణ అందించారు. స్థానిక సంస్థల ఎన్నికలు పారదర్శకంగా, శాంతియుతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరు తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పరశు, ఎంపీవో డి. వెంకటేష్, ఎంఇఓ చంద్రశేఖర్, పిఓలు తదితరులు పాల్గొన్నారు. ఎంసీసీ సమావేశం స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా ఉప్పునూతల మండల కేంద్రంలో సోమవారం ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. అధికారులు మాట్లాడుతూ గ్రామాల వారీగా ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) పకడ్బందీగా అమలు చేయాలని, ప్రతి రాజకీయ పార్టీ కఠినంగా నిబంధనలు పాటించాలని సూచించారు. ఎవరైనా ఎంసీసీ ఉల్లంఘనకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో అధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శులు, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థి దేవేందర్ యాదవ్‌కు సన్మానం చెసిన గురువులు



**పెద్దమందడి సూర్యన్యూస్:** పెద్దమందడి మండల కేంద్రానికి చెందిన వంగూరు చంద్రయ్య యాదవ్ కుమారుడు దేవేందర్ యాదవ్ ఉత్తమ ప్రతిభ కనబరచి మెడికల్ సీటు సాధించిన సందర్భంగా అయ్యపురెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సన్మానం చేయడం జరిగింది. ఇలాగే కష్టపడి చదువుతూ మంచి డాక్టర్‌గా పేరుతెచ్చుకోవాలనితెలిపారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ శాంతన్న,మన్యం పీడీ, శివ లెక్షరర్, సాయిచందర్ రెడ్డి స్కూల్ అసిస్టెంట్, శ్రీను ఎఈఓ పాల్గొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెద్దమందడి లో పదవ తరగతి వరకు సీటు సాధించడము గొప్ప విషయమని కొనియాడారు.

## రక్తదానం మహత్తర సేవ

### - జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా రవి కుమార్ నాయక్



**నాగర్ కర్నూల్ ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్:** నాగర్‌కర్నూల్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జాతీయ రక్తదాన దినోత్సవాన్ని జిల్లా పరిషత్ (పాత కలెక్టరేట్) ఆవరణలో ఘనంగా జరిగిన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. రవి కుమార్ నాయక్ హాజరై, రక్తదాతలను ఘనంగా సన్మానించారు. డా.రవికుమార్ నాయక్ మాట్లాడుతూ రక్తదానం ఒక మహత్తరమైన మానవతా సేవ అని ఒక్కరికి రక్తం అందించడం ద్వారా మరో వ్యక్తి ప్రాణాన్ని కాపాడవచ్చని, ఈ రక్తదానము కంటే గొప్పసేవ మరేదీ ఉండదన్నారు. రక్తం తయారు చేయలేనిదనీ, అవసర సమయంలో రక్తదాతలే నిజమైన దేవుళ్లని పేర్కొన్నారు. క్రమంతప్పకుండా రక్తదానంచేస్తే ఆరోగ్యానికి మేలు జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా యువత ముందుకు వచ్చి స్వచ్ఛంద రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ఎప్పుడూ రక్తం కొరత రాకుండా అందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ సెక్రటరీ రమేష్ రెడ్డి, యూత్ రెడ్ క్రాస్ జిల్లా కన్వీనర్ కుమార్, సభ్యులు సురేష్, వైద్య సిబ్బంది, రక్తదాతలు మహేందర్, సురేందర్, బుచ్చయ్య పాల్గొన్నారు.

## ఎన్నికల కోడ్ పై అవగాహన సమావేశం



**తెలకపల్లి సూర్యన్యూస్:** మండల కాంప్లెక్స్‌లో బుధవారం అధికారులు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) పై అవగాహన సమావేశం నిర్వహించారు, ఎంపీడీవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన చేశారు, కార్యక్రమంలో ఆర్వో మురళి, తాసిల్దార్ మహమ్మద్ జాకిర్ అలీ, ఎంపీ ఓ వెంకటయ్య పాల్గొన్నారు.

## మహిషాసుర మర్దిని దేవిగా వాసవి మాత అలంకరణ



**నాగర్ కర్నూల్ ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్ :** నాగర్ కర్నూల్ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో సాయి బాలాజీ సిండికేట్ మరియు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వాసవి కన్యకా పరమేశ్వరి భక్తులకు మహిషాసుర మర్దిని రూపంలో దర్శనమిచ్చారు. ఉత్సవ విగ్రహానికి దంపతులు అభిషేకాలు గణపతి సుబ్రహ్మణ్యం హోమాలు పూర్ణాహుతి నిర్వహించారు అనంతరం ఆలయ అర్చకులు నీరాజనం తీర్థ ప్రసాదాలను అందించారు ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ అధ్యక్షులు శివకుమార్ మాట్లాడుతూ పెద్ద ఎత్తున ప్రజలు నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు పూజా కార్యక్రమాలలో పాల్గొనడం జరిగిందని అన్నారు అన్న ప్రసాద వితరణ చేపట్టారు

## వాసవీ దేవాలయంలో ఏర్పాటు చేసిన బతుకమ్మను నిమజ్జనం చేసిన ఆర్యవైశ్య మహిళలు



**కొత్తకోట రూరల్ సూర్య:** తెలంగాణలో జరుపుకునే ప్రధాన పండుగలలో బతుకమ్మ ఒకటి. ఆశ్వయుజ మాసంలో జరుపుకునే ఈ బతుకమ్మ పండుగ తెలంగాణ సాంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుంది. తొమ్మిది రోజులపాటు మహిళలంతా ఆడుతూ, పాడుతూ ఈ పండుగను జరుపుకున్నారు. రంగురంగుల పూలను త్రికోణ ఆకారంలో పేర్చి అలంకరించిన బతుకమ్మల చుట్టూ చప్పట్లు చరుస్తూ వలయంగా తిరుగుతూ బతుకమ్మ పాటలను పాడతారు.ప్రకృతిలో లభించే ప్రతి పువ్వును బతుకమ్మలో ఉపయోగిస్తారు. ఇందులో లభించే ప్రతి పువ్వుకు ఎన్నో ఔషధ గుణాలు ఉంటాయని ఈ బతుకమ్మ పండుగకు ప్రకృతిలో లభించే అన్ని రకాల పూలను ఉపయోగిస్తారు. ఆ ప్రకృతిలో లభించే రకరకాల పూలను తీసుకువచ్చి ఆ అమ్మవారికి సమర్పిస్తూ పూలలోనే అమ్మవారిని చూసుకుంటూ ఆ బతుకమ్మను చక్కగా పేర్చి తొమ్మిది రోజులపాటు ప్రకృతిలో లభించే ప్రతి పువ్వును బతుకమ్మను పేర్చి ఆడి పాడి ఈ రోజు బతుకమ్మను బీచుపల్లి కృష్ణ నదిలో నిమజ్జనం చేస్తామని స్థానిక పట్టణ ఆర్యవైశ్య మహిళ అధ్యక్షురాలు యలిశెట్టి జయలక్ష్మీ అన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళలు భీమ రాధిక, మంజుల, భారతి, విజయలక్ష్మీ, లక్ష్మీ, కశెట్టి రాణి, అర్థం అనిత తదితరులు పాల్గొన్నారు.

## ఊట్కూర్‌లో ఘనంగా మాజీ మంత్రి ఎల్కోటి ఎల్లారెడ్డి 86వ జయంతి ఉత్సవాలు



**ఊట్కూర్ సూర్య న్యూస్:** ఊట్కూర్ మండల కేంద్రంలో బుధవారం మాజీ మంత్రి, కీర్తిశేషులు ఎల్కోటి ఎల్లారెడ్డి 86వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు, కుటుంబ సభ్యులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన కోడలు, మాజీ ఎంపీపీ ఎల్కోటి లక్ష్మి, కుమారులు ఎల్కోటి నారాయణరెడ్డి, ఎల్కోటి జనార్ధన్ రెడ్డి, కుటుంబ సభ్యులతో పాటు ప్రస్తుత పిఎసిఎస్ చైర్మన్ ఎం.బాల్ రెడ్డి, ఎం.మోహన్ రెడ్డి, కే.రాజు, ఎం.గోపాల్ రెడ్డి, రిటైర్డ్ టీచర్ కె.గోవిందప్ప, జగదీష్ గౌడ్ ,జమీర్ అలీ, దుర్గం శ్రీనివాస్, మాజీ జడ్పిటిసి సూర్యప్రకాశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ ఎల్లారెడ్డి ప్రజలకు అంకితభావంతో సేవలు అందించారు. ఆయన ఆశయాలు, విలువలు ఈ తరం ప్రజలకు స్ఫూర్తిదాయకం. సాధారణ ప్రజలతో మమేకమై ప్రజాసమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండేవారు అని తెలిపారు. కుటుంబ సభ్యులు మాట్లాడుతూ %-% ప్రతి ఏటా జయంతిని స్థానిక ప్రజలతో కలిసి జరుపుకోవడం మా గర్వకారణం. ఆయన చూపిన దారి మాకు ఎప్పటికీ మార్గదర్శకంగా ఉంటుంది అన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం, పాల్గొన్న వారికి మిఠాయిలు పంపిణీ చేశారు.

## జీవించే హక్కును హరించటం రాజ్యాంగ వ్యతిరేకం : సిపిఐ



**వనపర్తి టౌన్ సూర్యన్యూస్:** కేంద్రహోం మంత్రి అమిత్‌షా మావోయిస్టులను మార్చి 2026 లోగా హతమారుస్తామనటం రాజ్యాంగ వ్యతిరేకమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల నరసింహ అన్నారు. బుధవారం వనపర్తి సిపిఐ ఆఫీసులో జిల్లా కార్యదర్శి విజయరాములు అధ్యక్షతన జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా బాల నరసింహ పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగం జీవించే హక్కును ప్రతి ఒక్కరికి కల్పించిందన్నారు. రాజ్యాంగబద్ధ పదవిలో కొనసాగుతూ అమిత్ షా ఇలాంటి వ్యాఖ్యలు చేయటం నియంత ధోరణికి నిదర్శనం అన్నారు. కాల్పుల విరమణ చేసి చర్చలు జరపాలని ఎంతోకాలంగా మావోయిస్టులు కోరుతున్నా పెడచెవిన పెట్టటం సరికాదన్నారు. రాజకీయంగా, సిద్ధాంతపరంగా భిన్నభిప్రాయాలు ఉంటాయని ఆ కారణంగా చంపేస్తారా అని ప్రశ్నించారు. మావోయిస్టులను చర్చలకు పిలవాలన్నారు. దేశంలో బిజెపి ప్రజా వ్యతిరేక మతోన్మాద సంపన్న వర్గాల అనుకూల,విధానాలను అనుసరిస్తుందని ప్రతిఘటించి పోరాడేందుకు పార్టీ క్యాడర్లు సిద్ధం కావాలన్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఐదు జడ్పిటిసి, 15 ఎంపీటీసీ స్థానాలకు పోటీ జిల్లాలో ఐదు జడ్పిటిసి, 15 ఎంపీటీసీ స్థానాలకు పోటీ చేయాలని జిల్లా కౌన్సిల్లో నిర్ణయించామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాల నరసింహ చెప్పారు. అందుకు నాయకులు కార్యకర్తలు గ్రామాల్లో సిద్ధం కావాలన్నారు. గత అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్కు మద్దతు ఇచ్చి గెలిపించామని, భవిష్యత్తు ఎన్నికల్లో ఇదే రీతిలో కలిసి పని చేద్దామని ఆనాడు కాంగ్రెస్ నాయకులు మాట ఇచ్చారన్నారు. దానికి కట్టుబడి స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ కి సముచితమైన సీట్లు ఇవ్వాలన్నారు. వచ్చే పార్టీలతో పొత్తు పెట్టుకుని పోటీ చేస్తామన్నారు. లేని పక్షంలో తమతో కలిసివచ్చే పార్టీల తో పొత్తు పెట్టుకుని పోటీలో దిగుతామన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, చంద్రయ్య, రమేష్, శ్రీరామ్, సీఎన్ శెట్టి, రాబర్ట్, మోష, అబ్రహం, భాస్కర్, దంగు కుర్మయ్య, వంక గోపాల్, శ్రీహరి, కుతుబ్, ఎర్రకురుమయ్య, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## టిటిడి ఆధ్వర్యంలో శరన్నవరాత్రి మహోత్సవాలు



**ఊట్కూర్ సూర్యన్యూస్:** టిటిడి హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి పాలమూరు జిల్లా ఆధ్వర్యంలో మనగుడి-2025 ఆశ్వయుజ మాసశరన్న వరాత్రి మహోత్సవాలు మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు జిల్లా ఉపన్యాసకులు దొరోల్ల కృష్ణయ్య తెలిపారు. మంగళవారం బిజ్వార్ శ్రీ చౌడేశ్వరి మాత దేవాలయంలో జరిగిన ప్రవచనంలో ఆయన మాట్లాడుతూ నవరాత్రుల విశిష్టత, విజయదశమి ప్రాధాన్యం, మహిషాసుర మర్దిని అంశాలను వివరించారు. బుధవారం రాత్రి లలిత సహస్రనామ పారాయణం గురువారం అన్నమాచార్య సంకీర్తనల కార్యక్రమం జరగనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ హిందూ ధర్మ మహత్తును ప్రపంచానికి చాటి చెప్పే విధంగా టిటిడి అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తోందని అన్నారు. వేదాలు, పురాణాలు, రామాయణం, భాగవతం, భగవద్గీతలోని అనేక విషయాలను ప్రజలకు చేరవేస్తూ సమాజంలో సానుకూల మార్పులకు శ్రీకారం చుట్టిందని వివరించారు. అలాగే ప్రతి వ్యక్తి మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలవాలని, కులాలు, వర్గాలు వేర్వేరు అయినా మానవత్వం ఒక్కటేనన్న భావనతో హిందువులందరూ సఖ్యతతో జీవించాలని పిలుపునిచ్చారు. ఈ మహోత్సవాల కోసం కృషి చేసిన ఉమ్మడి పాలమూరు జిల్లా కార్యనిర్వహణ అధికారి ఉత్తరపల్లి రామాచార్యులకు గ్రామస్థులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్. నర్సింహా, రాజమూరి, తిరుపతి, శ్రీనివాసులు, బాల నర్సింహా, కవిత, మంగమ్మ, బసమ్మ, కిష్టమ్మ, లక్ష్మి, మంజుల, కుసుమకుమారి తదితరులు పాల్గొన్నారు.

సూర్య
www.suryaa.com



## పెద్దమందడిలో చెన్నకేశవ దేవాలయంలో దుర్గామాత అమ్మవారిని దర్శనం చేసుకున్న : ఎమ్మెల్యే తుడి మెగారెడ్డి



**పెద్దమందడి సూర్య న్యూస్:** పెద్దమందడి మండల కేంద్రంలో బుధవారం రోజు దేవి నవరాత్రుల్లో భాగంగా చెన్నకేశవులు దేవాలయంలో ప్రతిష్టించిన దుర్గామాతను దర్శనం చేసుకున్న వనపర్తి ఎమ్మెల్యే తుడి మెగా రెడ్డి, ఎమ్మెల్యే మెగా రెడ్డి మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆనందంగా ఉండాలని అన్నారు. ఎమ్మెల్యే వెంట జిల్లా యూత్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, తిరుపతి రెడ్డి వనపర్తి జిల్లా మార్కెట్ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి,ఉన్నారు ఈ కార్యక్రమంలో పెద్దమందడి గ్రామ నాయకులు ఎస్రవి టైలర్,సుగర్ రాఘవేంద్ర, కొమ్ము వెంకటస్వామి, వాకిటి నరేష్ కుమార్, ఎస్ జయరాములు, నందిమల్ల కురుమన్న, నీలం రవి, బోయ స్వామి, రాధాకృష్ణ, గ్రామ ప్రజలు పెద్దలు ఆడపడుచులు పాల్గొన్నారు.

## శ్రీ భక్త మార్కండేయ శివాలయంలో మహిషాసుర మర్దినిగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు



**అచ్చంపేట సూర్య న్యూస్:** అచ్చంపేట పట్టణంలోని శ్రీ భక్త మార్కండేయ శివాలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బుధవారం అమ్మవారు మహిషాసురమర్దిని దేవి రూపంలో దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పోకల మనోహర్ ఆలయంలో శివునికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పోకల మనోహర్ని చల్వ కప్పు సన్మానించారు. మహిళలు బతుకమ్మలు, కోలాటాలు, ఆడారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో శివాలయ కమిటీ అధ్యక్షులు వనం పర్వతాలు, పద్మశాలి సంఘం అధ్యక్షులు కోట కిషోర్, మహిళ సంఘం అధ్యక్షురాలు దాసపత్రి శకుంతల, కౌన్సిలర్ రమేష్ రావు, ధనరాజ్, రాములు, వేణు, నర్సింహ, హైమావతి, ప్రశాంతి, రాజేశ్వరి, జగదీష్, రమేష్, శ్రీనివాసులు, సైదులు, మహేష్, రవికుమార్ లు పాల్గొన్నారు.

## గోపాల్పేట క్రికెట్ పోటీలో ఎర్రగట్టు తాండ మొదటి బహుమతి



**గోపాలపేట, సూర్య :** గోపాల్పేట మండల కేంద్రంలో జిపిఎల్ సీజన్ క్రికెట్ పోటీలో ఎర్రగడ్డ తాండ కు మొదటి బహుమతి రెండవ బహుమతి గెలుచుకున్నారు గత వారం రోజులుగా క్రికెట్ పోటీలు నిర్వహించారు దాదాపు పది టీములు పాల్గొన్నవి మొదటి బహుమతికి 20000 మాజీ వార్డ్ మెంబర్స్ అందజేయగా రెండవ బహుమతి టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బాలరాజు 10000 రూపాయలు అందజేశారు బెస్ట్ బ్యాడ్మిన్ గా రాజేందర్ బెస్ట్ బౌలర్గా లాలు నాయక్ గెలుచుకున్నారు

## ఎంబీబీఎస్ సీటు సాధించిన రైతుబిడ్డ : సన్మానించిన గ్రామస్థులు



**మల్దకల్ సూర్య న్యూస్:** ఇటీవల జరిగిన నీట్ పరీక్షలలో రెండవ దఫాలో వచ్చిన ఫలితాలలో సంగారెడ్డి ఎమ్మెన్నార్ మెడికల్ కాలేజీలో మల్దకల్ మండలం పరిధిలోని శేషంపల్లి గ్రామానికి చెందిన రైతు బిడ్డ శ్రీలత ఎంబీబీఎస్ సీటు సాధించింది. శేషంపల్లి గ్రామానికి చెందిన ఈదుల భాయి ధర్మన్న భారతి దంపతుల కుమార్తె అయిన శ్రీలత ఎంబీబీఎస్ సీటు సాధించడం పట్ల గ్రామ మాజీ సర్పంచ్ ప్రతాప్, మాజీ ఎంపీటీసీ రాజు, బాబాయ్ పవన్ కుటుంబ సభ్యులు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# పండుగల వేళ ధరల భారం



**వనపర్తి సూర్య న్యూస్:** పండుగలు వస్తే చాలు ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. వనపర్తి పట్టణంతో పాటు జిల్లా నలుమూలలలో నిత్యవసరాల ధరలు సామాన్య ప్రజానీకానికి అందనంత పరిస్థితికి చేరుకున్నాయి. పెరుగుతున్న ధరలతో పండుగలు మధురంగా గడిపే అవకాశం అనిపించకుండాపోతోంది.

***విక్రేతల పెత్తనం..*** వనపర్తి బస్టాండ్ చుట్టూ,కమాన్ ప్రధాన వీధుల్లో, మార్కెట్ ప్రాంతాల్లో కూరగాయలు, కిరాణా సరుకులు అమ్మే వ్యాపారులు ఇష్టం వచ్చినట్లు ధరలు పెడుతున్నారు. టమాటా, మిరపకాయ, బీన్స్, వంటి కూరగాయలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. ఇక బియ్యం, పప్పు ధాన్యాలు, నూనె ధరలైతే సాధారణ కూలీ తరగతికి అందని ద్రవ్యాలయ్యాయి.

***తూనికల మోసాలు పతాక స్థాయిలో..*** పలు కిరాణా షాపుల్లో తూకాల్లో మోసం చేస్తున్నారు. 1 కిలోగా అమ్మే సరుకు అసలు తూకంకు 900 గ్రాములే ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. సరైన ప్రమాణాల్లో లేవు. తూనికల కొలతల శాఖ ఉన్నదా లేక లేదా అనే అనుమానం ప్రజలలో కలుగుతోంది.

***కిరాణా షాపుల్లో కాలం చెల్లిన సరుకులు..*** వనపర్తి పట్టణంతో పాటు మండల ప్రాంతాల్లోని గల్లీ గల్లీల్లోనూ కొన్ని కిరాణా దుకాణాల్లో కాలం చెల్లిన నూనె ప్యాకెట్లు, పాలు, స్నాక్స్, బిస్కెట్లు అమ్మకానికి ఉన్నాయి. ఇవి అధిక ధరలకు విక్రయించబడుతున్నా సంబంధిత అధికారులు స్పందించడం లేదు. పేద, మధ్య తరగతి ప్రజలు అవి కనబడితేనేగాని అర్థం కాకుండానే కొనుగోలు చేస్తున్నారు.

***అధికారుల మౌనం పట్ల ఆగ్రహం..*** జిల్లాలో తూనికల కొలతల శాఖ, మునిసిపాలిటీ, ఫుడ్స్ ఇన్స్పెక్టర్లు, రెవెన్యూ అధికారులు ఉన్నారా? అనే ప్రశ్న వినిపిస్తోంది. వారిని ఎప్పుడైనా తమ ప్రాంతాల్లో చూసిన వారు లేరని స్థానికులు చెబుతున్నారు. పండుగల సందర్భంగా తప్పనిసరిగా మానిటరింగ్ ఉండాలి గానీ, అధికారులు మొక్కుబడి దాడులు చేసి మౌనం సాధిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

***కుళ్లిన కూరగాయల విక్రయం..*** వనపర్తి సెంటర్లోని ప్రధాన రహదారిపై, మార్కెట్ యార్డులో, రోడ్డుమీదే బండ్ల మీద పెట్టుకుని విక్రేతలు కుళ్లిన కూరగాయలు, మురికిగా ఉన్న ఆకుకూరలు విక్రయిస్తున్నారు. వాటిని నిత్యం వాడే ప్రజలు ఆరోగ్య ప్రమాదాలకు గురవుతున్నారు.

***పేదలకు పండుగలు దూరం..*** కూలీలకు పండుగ పేరుతో వస్తున్న ధరల పెరుగుదల భారంగా మారింది. ఒక పక్క మితిమీరిన ధరలు, మరోపక్క తూకాల్లో మోసం... అందువల్ల పండుగలు పేదలకు చేదుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తమవుతోంది.

తక్షణమే అధికార యంత్రాంగం స్పందించి, జిల్లా వ్యాప్తంగా కూరగాయల మార్కెట్లు, కిరాణా షాపులు, మటన్, చికెన్ దుకాణాలపై ప్రత్యేక దాడులు నిర్వహించాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై లైసెన్సులు రద్దు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

### - ధరూర్ మండలం ముఖ్య నాయకుల సన్నాహక సమావేశం
### - నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ళ రంజిత్ కుమార్

**గద్వాల టౌన్ మేజర్న్యూస్:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నడిగడ్డ హక్కుల పోరాట సమితి తరఫున పోటీచేయడానికి సిద్ధం కావాలని జిల్లా చైర్మన్ గొంగళ్ళ రంజిత్ కుమార్ ధరూర్ మండల ముఖ్య నాయకులతో కలిసి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు సందర్భంగా నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు, కార్యకర్తలు అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలని సమితి నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో గెలుపు అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ శ్రేణులను బలపర్చేందుకు కృషి చేయాలన్నారు. కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉండి ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలు తెలుసుకొని వారికి అండగా నిలవాలని, రాబోయే ఎన్నికల గెలుపుకోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు, జిల్లా నాయకులు




రంగస్వామి, జమ్మన్న, ధరూర్ మండల అధ్యక్షుడు నెట్టెంపాడు గోవింద్, మండల ఉపాధ్యక్షులు అడవి ఆంజనేయులు, మునెప్ప, ఆంజనేయులు, కార్యదర్శి రాము, వామన్ పల్లి మాజీ సర్పంచ్ ఆంజనేయులు, నాయకులు శాంతిరాజ్, వెంకటేష్, వీరేష్, రామకృష్ణ, గోవిందు, దరెప్ప, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక పరివర్తనే సంఘ్ పరివార్ లక్ష్యం

### - సామాజిక మార్పు కోసం పంచ పరివర్తన్ అవసరం - ఆర్ఎస్ఎస్ జిల్లా సంపర్క ప్రముఖ్ సూరంపల్లి సాయిబాబు

**లింగాల, సూర్య న్యూస్:** సామాజిక దృక్పథంతో మార్పు కోసం నేటి సమాజానికి పంచ పరివర్తన్ ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆర్ఎస్ఎస్ జిల్లా సంపర్క ప్రముఖ్,ప్రధాన వక్త సాయిబాబు పిలుపునిచ్చారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శాతాబ్ది, దసరా ఉత్సవం మండల పరిధిలోని రాయవరం గ్రామంలో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. శక్తితోపాటు, సంస్కారం, సేవాభావం కలిగి ఉండి సంఘ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ దేశ సార్వతోముఖాభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తామని సంఘ పరివార్ సభ్యులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1925 విజయదశమి రోజున డాక్టర్ హెడ్గేవార్ ఆర్ఎస్ఎస్ స్థాపించి వందేళ్లు పూర్తి కాబోతున్న సందర్భంగా దేశం మొత్తం దసరా ఉత్సవం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆర్ఎస్ఎస్ ఒక సంస్థ కాదని యావత్ సమాజాన్ని సంఘటిత పరిచే శక్తి అని అన్నారు. సంఘ్ జాతీయ భావజాలాన్ని సమాజంలో విస్తరింప చేయడం కోసం,సంఘ్ పై జరుగుతున్న దుష్ప్రచారానికి ధీటుగా జవాబు చెప్పాలని, సమాజాన్ని మేల్కొలిపే కార్యక్రమాలను చేపడుతూ సామాజిక పరివర్తన పై దృష్టి సారించాలని సంఘ్ పరివార్ సభ్యులకు సూచించారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది సంవత్సరంగా తలపెట్టిన పంచ పరివర్తన్లో భాగంగా సామాజిక సామరాస్యతకై కులరహిత



సమాజ నిర్మాణం, భిన్నత్వం ఏకత్వం చాటాలన్నారు. స్వదేశీ జరగరణకై మన ప్రాంతం, దేశంలో తయారైనా వస్తువులని వాడాలన్నారు. పౌరవిధులు నిర్వర్థించాడానికై నిబంధనలు పాటించడం, భవిష్యత్ తరాలకు నీళ్లు, విద్యుత్ వినియోగన్ని సక్రమంగా నిర్వర్తించాలన్నారు. కుటుంబం ప్రభోధన్ లో భాగంగా కుటుంబ వ్యవస్థ బలపరచడం,పిల్లలు పెద్దల పట్ల గౌరవ మర్యాదలతో వ్యవహరించేలా చూడాలన్నారు. పర్యావరణ పరిరక్షణకై పాటు పడుతూ ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించడం, చెట్లను పెంచడం చేస్తూ పంచ పరివర్తన్ లక్ష్యసాధనకు మొత్తం సమాజం క్రియాశీలకంగా పాల్గొనాలని అన్నారు. విజయానికి ప్రతికైనా విజయదశమి యొక్క మహత్యాన్ని వివరించినారు. హిందూత్వ సంస్కృతి సంప్రదాయాలను కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ ఉత్సవ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లయ్య, తెల్కపల్లి ఖండ కార్యవహాగా కేతావత్ శివనందన్, ఖండసేవా ప్రముఖ్ ముడావత్ శ్రీనివాసులు, ఉపమండల ప్రముఖ్ పాత్లావత్ శంకర్, రాయవరం శాఖ కార్యవహా బసరత్ శివశంకర్,బిజెపి మండల అధ్యక్షులు గువ్వని నవీన్, గ్రామ పెద్దలు తిరుపతి రెడ్డి, ఉల్లంగొండ్ల రాజు, శివయ్య లోకనాథం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా ఉన్న గుంతలను పూడ్చండి సార్



**తెలకపల్లి సూర్యన్యూస్:** ప్రమాదకరంగా ఉన్న గుంతలు పూడ్చాలని వాహనదారులు, ప్రజలు అధికారులను డిమాండ్ చేస్తున్నారు, ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా నాగర్ కర్నూల్, అచ్చంపేట కల్వకుర్తి మల్లెలమ్మ టెంపుల్‌దగ్గర ప్రధానరహదారిపై పలుచోట్ల ఏర్పడిన గుంతలతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి, మండల కేంద్రంలో రాకొండ వైపు వంతెన దగ్గర నడిరోడ్డు పై గుంతలు ఏర్పడ్డాయి, అదే విధంగా కల్వకుర్తి మలుపు కూడలి వద్ద నడిరోడ్డుపై ఏర్పడిన గుంత అటు నాగర్ కర్నూల్, ఇటు కల్వకుర్తి రోడ్ల నుండి వచ్చే వాహనాలు గుంత వద్ద ప్రమాదాలకు గురవుతున్నారు సమస్యను అధికారులు వెంటనే పట్టించుకొని గుంతలమరమ్మతులు చేయాలని చెబుతున్నారు, లేకుంటే వాహనదారుల ఆధ్వర్యంలో ధర్నా చేపడతామని హెచ్చరిస్తున్నారు.

## బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు



**కొత్తకోట రూరల్ సూర్య:** కొత్తకోట మండలం పామపురం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు రాఘవేంద్ర సాగర్, యూసఫ్, పెంటన్న, తెలుగు నరసింహ, గుజ్జుల అంజి, సుశీలమ్మ, సుజాతమ్మ, సలహాబి తదితర కార్యకర్తలు, యువకులు ప్రజా ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై స్థానిక మరియు మండల కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో... దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే మధుసూధన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పామపురం గ్రామస్థులు పాల్గొన్నారు.

## వనపర్తి జిల్లా ప్రజలకు విజయ దశమి దసరా శుభాకాంక్షలు : జిల్లా ఎస్పీ రావుల గిరిధర్



**వనపర్తి టౌన్ సూర్య :** దుష్ట శక్తులపై విజయానికి సంకేతముగా జరుపుకునే దసరా వండుగను స్ఫూర్తిగా తీసుకొని ప్రజలందరు ఐక్యత, సమగ్రతల కోసం కృషి చేయాలని దసరా పర్వదినం సందర్భంగా జిల్లా పోలీసుశాఖ తరపున జిల్లా ప్రజలకు, పోలీసు అధికారులకు, సిబ్బందికి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపీఎస్ గారు విజయదశమి దసరా పండుగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... విజయదశమి ప్రజల జీవితాల్లో తేజస్సు, విజయాన్ని తేవాలని ఆకాంక్షిస్తూ. పండు ఉత్సవాలు నిర్వహించు కునేవారు సంతోషకరమైన వాతావరణంలో, ఆరోగ్యకరంగా అందరూ కలిసిమెలిసి సోదరాభావంతో ఉత్సవం నిర్వహించుకోవాలని కోరారు. పోలీసుశాఖలో ప్రతి అధికారి ప్రజా రక్షణలో అగ్రగామిగా ఉండి, శాఖ గౌరవాన్ని మరింత పెంచే విధంగా పనిచేయాలని సూచించారు. పండుగలను అందరూ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, ముఖ్యంగా నవరాత్రుల అనంతరం జరిగే దుర్గామాత విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలను కూడా శాంతియుతంగా నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ కోరారు.

## శ్రీ అన్నపూర్ణదేవి ఆలయాన్ని దర్శించుకున్న గొంగళ్ళ రంజిత్ కుమార్ దంపతులు



**గద్వాల సూర్యన్యూస్:** గద్వాల జిల్లా కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవస్థానం నందు ఉన్న శ్రీ అన్నపూర్ణేశ్వరదేవి దేవాలయాన్ని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ళ రంజిత్ కుమార్ దంపతులు జిల్లా కన్వీనర్ బుచ్చిబాబుతో పాటు కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వైండింగ్ రాములు స్వామి జిల్లా చైర్మన్ గొంగళ్ళ రంజిత్‌కుమార్ దంపతులతో పాటు జిల్లా కన్వీనర్ బుచ్చిబాబులను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు వెంకట్రాములు, ధరూర్ మండల అధ్యక్షుడు నెట్టెంపాడు గోవింద్, నాయకులు అడివి ఆంజనేయులు, మల్దకల్, మునెప్ప, రాము, వెంకటేష్, వీరేష్,రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# నేషనల్ అలైన్స్ ఆఫ్అగ్రికల్చర్ అలైడ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చైతన్య కార్యక్రమాల కార్యాచరణ సమావేశం

### - జిల్లా కార్యదర్శి జీ నరసింహులు ఆధ్వర్యంలో ముఖ్య నేతల సమావేశం



**గద్వాల్ సూర్యన్యూస్:** బుధవారం జోగు లాంబ గద్వాల జిల్లా కేంద్రంలో స్థానిక వాల్మీకి భవనం నందు తెలంగాణ వ్యవసా య వృత్తిదారుల యూనియన్ టి.వి.వి.యు మరియు తెలంగాణ గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్స్ యూనియన్ టీజీపీఎం డబ్ల్యూ సంయుక్త ఆధ్వర్యంలో అక్టోబర్ 1వ తేదీ నుండి 16వ తేదీ వరకు పలు చైతన్య కార్యక్రమాలకు సంబంధించిన 16 రోజుల కార్యక్రమాన్ని ప్రారంభిం చడం జరిగినది. వాల్మీకి నేతలు మాట్లాడుతూ నేషనల్ అలైన్స్ ఆఫ్ అగ్రికల్చర్ అలైడ్ వర్కర్స్ యూనియన్ జాతీయ స్థాయి పిలుపు మేరకు తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు మరియు పాండిచ్చేరి ఐదు రాష్ట్రాల్లో అక్టోబర్ 1వ తేదీ నుండి 16వ తేదీ వరకు ఆయన రాష్ట్రంలో రాష్ట్రస్థాయి యూనియన్ల ఆధ్వర్యంలో వ్యవసాయ కూలీలు అసంఘటిత రంగ కార్మికులతో కలిసి గ్రామాలలో పలు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తూ సమస్యలను గుర్తించి అక్టోబర్ 16వ తేదీన ఆయా దేశాలు జరుపుకునే ప్రపంచ ఆహార దినోత్సవ కార్యక్రమాన్ని ప్రపంచ ఆకలి దినంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రభుత్వానికి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేస్తుంది గ్రామాల్లో చేతినిండా పని ఉండదు, చేసిన పనికి కనీస మరియు సమాన వేతనాలు ఉండవు. ఉపాధి హామీలు డిలీట్ఉపాధి హామీ లు డిలే పేమెంట్లు అసంఘటిత రంగ కార్మికులకు చట్టబద్ధమైన సామాజిక భద్రత లేకపోవడం మరియు మరియు స్వాతంత్ర 79వ స్వాతంత్ర భారత దేశంలో దళితులు మహిళలు పిల్లలు మరి యు పేద వర్గాలపై దాడులు జరుపుకునే ఉన్నాయి మరో ప్రక్కన వాతావరణంలో వచ్చేమార్పుల వల్ల వ్యవసాయ కూలీలు నెలలు తరబడి పనులు కోల్పోతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లోవలస పారినపడి గుంపు మేస్త్రీల చేతుల్లో నిర్బంధం కార్మికులుగా పనిచేస్తున్న వైనం నేటికి ఉన్నది ఇట్లాంటి ఇట్లాంటి పరిస్థితులలో ప్రపంచ ఆహార దినాన్ని వ్యతిరేకిస్తూ పలు నిరసన కార్యక్రమాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్లతో కూడిన వినతి పత్రాలు ఆయా జిల్లా కలెక్టర్ల ద్వారా అందజేయడం జరుగుతుంది. అందులో భాగంగా బుధవారం జోగులాంబ గద్వాల జిల్లాలో 16 రోజుల రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగినది ఈ యొక్క కార్యక్రమానికి గద్వాల జిల్లా లోని వివిధ మండలాల నుండి వ్యవసాయ కూలీలు అసంఘటితరంగా కార్మికులు పాల్గొన్నారు. ఈకార్యక్రమానికి తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్టగాళ్ల వెంకటయ్య, రాష్ట్ర మహిళా కార్యదర్శి డి వెంకటేశ్వరమ్మ , గద్వాల జిల్లా కార్యదర్శిలు నర్సింహులు, టి పద్మ వివిధ ప్రతినిధులు ఈశ్వరమ్మ, శ్రీనివాసులు, సంజీవ్ కుమార్, రాములు, వినోద, కవిత, తెలంగాణ గ్రామ పంచాయతి మల్టీపర్పస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి నాగన్న తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుకు ఇరువైపుల ముళ్ళ చెట్లు ద్విచక్ర వాహనాలకు ఇబ్బందులు



**గోపాలపేట, సూర్య :** ఆర్ అండ్ బి రోడ్డు పైన మోటార్ సైకిల్ పైన ప్రయాణం చేయాలంటే ఎప్పుడు ప్రమాదం ముంచుకొస్తుందో అర్థం కావడం లేదని ద్విచక్ర వాహనదారులు వాపోతున్నారు మనము ఎంత జాగ్రత్తగా వెల్లిన ఎదురుగా వస్తున్న వాహనం అతివేగంగా వచ్చి ఎప్పుడు ఢీకొంటుందో అర్థం కావడం లేదు అని భయాందోళనకు గురవుతున్నారు అయితే ఆర్ అండ్ బి రోడ్డుకు ఇరువైపులా ముళ్ళ చెట్లు తో పాటు గడ్డి చెట్లు మొలవడంతో సిగ్నల్ బోర్డ్స్ సరిగా అగుపించడం లేదని దీంతో ద్విచక్ర వాహనాలకు ఇబ్బందులు అవుతున్నాయని అంటున్నారు మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న పెద్ద వాహనాలు సరిగా కనపడవు దీంతో రోడ్డుకు కిందికి దిగి వెళ్దామంటే ముండ్ల కంచ చెట్లు ఉండడంతో వెళ్లడానికి ఇబ్బందులు అవుతున్నాయని అంటున్నారు ముండ్ల కంచా చెట్లు ఆర్ అండ్ బి రోడ్డుకు రావడంతో ఇటీవల కాలంలో తాడిపర్తి మలుపు దగ్గర మోటార్ సైకిల్ పై వనపర్తి కి వెళ్తూ చెట్టుకు ఢీకొనిమృతి చెందాడు మోటార్ సైకిల్ రెండు పెద్ద వాహనాలు వచ్చినప్పుడు మట్టి రోడ్డు మీదికి రావాలంటే వీలు లేకుండా ఉందని వాహనదారులు అంటున్నారు మలుపుల వద్ద అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేసి రాత్రిపూట కనబడేటట్లు రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేశారు కానీ ముండ్ల చెట్లు పెరగడంతో సూచిక బోర్డులు కనబడటం లేదు కావున ప్రమాదాలు జరగకముం దుకే ఆర్అండ్‌బి అధికారులు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్లపొద చెట్లను తొలగించి ప్రమాదాలు కలగకుండా చూడాలనిద్విచక్ర వాహనదారులు కోరుతున్నారు

## డి.ఎం.హెచ్.ఓ డాక్టర్ ఎస్‌కె సిద్ధప్ప చేతుల మీదుగా న్యూట్రిషన్ కిట్లు పంపిణీ



**గద్వాల సూర్య న్యూస్:** బుధవారం గద్వాల జిల్లా ఓల్డ్ డి ఎం హెచ్ ఓ ఆఫీసు లో స్వస్త్ నారి స్వశక్త్ పరివార్ అభియాన్ భాగంలో డి.ఎం.హెచ్.ఓ డాక్టర్.ఎస్ కె సిద్ధప్ప మరియు యెన్. సి. డి. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సంధ్య కిరణ్మయి టీబి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి రాజు ఆధ్వర్యంలో టీబి బెనిఫిషరీస్ కు జ్యోతి ఎ. ఎన్.యం బుర్ధపేట వారు న్యూట్రిషన్ కిట్లు టీబి పేషెంట్స్ కు ఇవ్వడం జరిగినది డి.ఎం.హెచ్.ఓ టీబీ వ్యాధి పట్ల అవగాహన కలిగించారు క్షయ వ్యాధిగ్రస్తులకు ట్రీట్మెంట్ తో పాటు పౌష్టిక ఆహారం ఎంతో కీలకమైనది క్షయ వ్యాధిగ్రస్తులు ట్రీట్మెంట్ తో పాటు పౌష్టిక ఆహారం సమతుల్యంగా తీసుకుంటే కచ్చితంగా జయిస్తారన్నారు. క్షయ వ్యాధి ఎక్కువ శాతం పేద ప్రజలకు సోకుతుంది కాబట్టి పేద టీబి ప్రజలను గుర్తించి న్యూట్రిషన్ కిట్స్ ఇవ్వడం జరిగినదన్నారు. టీబీ చికిత్సకాలం 6 నెలల వరకు ప్రతినెల అందజేయడం జరుగుతుంది కార్యక్రమంలో డి.ఎం.హెచ్.ఓ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న దాతలు ముందుకు వచ్చి టీబి పేషెంట్లను దత్తత తీసుకోవాల్సిందిగా కోరారు. ఇట్టి కార్యక్రమంలో డి.ఎం.హెచ్. ఓడిఎమ్, హెచ్ఓ డాక్టర్.ఎస్.కె సిద్ధప్ప, యెన్. సి.డి. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సంధ్య కిరణ్ మయి డాక్టర్ జి రాజు టీబి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ మాధుర్య, మరియు ఎన్‌టిఇపి స్టాఫ్ హనుమంతు టి.బి.నోడల్ పర్సన్ ఆశాస్ పాల్గొనడం జరిగినది.

## ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించిన బాసు హనుమంతు నాయుడు



**గద్వాల సూర్యన్యూస్ :** బుధవారం నియోజకవర్గంలోని గద్వాల మండలం శివపురం గ్రామంలో విజయదశమి (దసరా) పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా బిఆర్ఎస్ పార్టీ గద్వాల్ నియోజకవర్గ ఇంచార్జ్ బాసు హనుమంతు నాయుడు హాజరై ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని టాస్ వేసి బ్యాటింగ్ చేసి యువకులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి క్రీడా పోటీల నిర్వహణ వల్ల యువకుల మధ్య స్నేహబంధం పెరగడంతో పాటు ఆటల పట్ల పట్టుదల పెరుగుతోందని అన్నారు. గ్రామీణ ప్రాంత క్రీడలు ప్రతి ఒక్క క్రీడాకారులు చక్కటి ప్రదర్శన ఇచ్చి గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు మీ ప్రదర్శనలు తీయాలని, భవిష్యత్తులో ఇలా రంగంలో అత్యున్నత స్థాయికి ఎదిగి గద్వాల ప్రాంతానికి కూడా మంచి పేరు వచ్చే విధంగా కృషి చేయాలని తెలిపారు. విద్యతో పాటు క్రీడ నైపుణ్యత పొంది క్రీడా రంగంలో కూడా రాణించాలి అని కోరారు .క్రీడల్లో గెలుపు ఓటములు సహజమే, ఓడిపోయినా నిరుత్సాహ పడకూడదు, గెలిచాము అని గర్వపడవద్దు అని అన్నారు. గత కేసీఆర్ గారి ప్రభుత్వంలో క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీచుపల్లి, మోనేష్, డి.శేఖర్ నాయుడు,శ్రీ రాములు, పూడూరు అంజి, సుధాకర్ రెడ్డి,చిన్న యాదవ్,అంజి,వెంకటేష్,చాకలి శ్రీనివాసులు, రవి, నరేష్, సోమశేఖర్, నవీన్, రాజు, మరియు క్రీడాకారులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పత్తి రైతులకు ఎకరాకు రూ.25 వేలు నష్టపరిహారం చెల్లించాలి : సామాజిక కార్యకర్త మహేష్ గౌడ్



**ఊట్కూర్ సూర్య న్యూస్:** అకాల వర్షాల కారణంగా నష్టపోయిన పత్తి రైతులకు ప్రభుత్వం వెంటనే సహాయం అందించాలని సామాజిక కార్యకర్త బిజ్వార్ మహేష్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని బిజ్వార్, మ్నొగ్దుంపూర్, అవుసలోనిపల్లి గ్రామాలలో పంట నష్టాన్ని ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పత్తిపంట సాగుకు రైతులు అధికంగా పెట్టుబడులు పెట్టారని, కానీ అకాల వర్షాల వల్ల విస్తారంగా పంటలు ఎర్రబారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు కనీసం రూ.25 వేల నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు ప్రతి గ్రామంలో క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి తక్షణమే పంట నష్ట నివేదికలు సిద్ధం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయుధ పూజ



**నారాయణపేట జిల్లా ప్రతినిధి సూర్య న్యూస్:** విజయదశమి పండగను పురస్కరించుకుని నారాయణపేట జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఆర్ఐ నరసింహ ఆయుధ పూజ, ఎంటిఓఆర్ ఎస్సై శివశంకర్ వాహన పూజా కార్యక్రమనీ నిర్వహించారు. ఆర్ఐ నరసింహ మాట్లా డుతూ విజయదశమి పండగ సందర్భంగా జిల్లా ప్రజలకు, అధికారులకు ముందుగా విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా విజయదశమి పండుగను జరుపుకుంటా రన్నారు. చెడును పారద్రో లెందుకు పోలీస్ విభాగం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో పండగను జరుపుకోవాలని తమఅనుకున్న పనులు విజయవంతం అవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రియాజ్ హుల్ హక్, ఆర్ ఎస్సై లు శ్వేత, శిరీష, కృష్ణ చైతన్య, %×% లు, అర్మ్డు రిజర్వు పోలీసులు మొదలగు వారు పాల్గొన్నారు.

## దుర్గామాత నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేయాలి - అదనపు కలెక్టర్‌కు ఉత్సవ సమితి వినతి



**నారాయణపేట జిల్లా ప్రతినిధి సూర్యన్యూస్:** నారాయణపేట జిల్లా కేంద్రంలో దేవి నవ రాత్రి వేడుకల అనంతరం చేసే దుర్గా మాత నిమజ్జానికి అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ను బుధవారం ఉత్సవ సమితి సభ్యులు కలిసి విన్నవించారు. నిమజ్జనం కోసం కొండారెడ్డి చెరువు వద్ద ఈ నెల 2,3,4తేదీల్లో క్రేన్ సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే పట్టణంలో జరిగే నిమజ్జన శోభాయాత్ర కు అనుకూలంగా రోడ్ల మరమ్మతు పనులు చేపట్టాలని విన్నవించారు.అందుకు అదనపు కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి అధ్యక్షుడు భీంచందర్ గౌడ్, కార్యదర్శి మిర్చి వెంకటయ్య, సభ్యులు రఘువీర్ యాదవ్,నందు నామాజీ,శివకుమార్,టి.ఆశప్ప పాల్గొన్నారు.

## ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థి సి అభిలాష్



**చిన్నచింతకుంట. సూర్య న్యూస్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించిన నీట్ పరీక్ష ఫలితాల్లో చిన్నచింతకుంట మండల పరిధిలోని మద్దూరు గ్రామానికి చెందిన సి లక్ష్మన్న మల్లేశ్వరమ్మ దంపతుల కుమారుడు సి అభిలాష్ ప్రభుత్వ కోటాలో ర్యాంకు సాధించి మల్లారెడ్డి మెడికల్ కాలేజీ హైదరాబాద్ ఇనిస్టిట్యూట్ లో ఎంబిబిఎస్ సీటు సాధించాడు తల్లిదండ్రులు తండ్రి మహబూబ్నగర్ జిల్లా జడ్చర్ల మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్‌గా పనిచేస్తూ తల్లి ఇంటిలో పని చేస్తూ కష్టపడి చదివించారు తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి సి అభిలాష్ కష్టపడి చదివి ఎంబిబిఎస్ సీటు సాధించడం పట్ల గ్రామస్తులు యువకులు హర్షం వ్యక్తం చేశారు అదేవిధంగా ఇష్టంతో కష్టపడి మండల పరిధిలోని మద్దూరు గ్రామంలో కూడా విద్యార్థులు మరెన్నో విజయాలు సాధించాలని ప్రశంసించడం జరిగింది సి అభిలాష్ ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు మరింత ముందుకు సాగాలని సూచించారు పట్టుదలతో చదివి మంచి ఉత్తీర్ణత సాధించి ఉత్తమ డాక్టర్‌గా రాణించి గ్రామానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు కోర్సును పూర్తి చేసి డాక్టర్ గా రానించి పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని గ్రామస్తులు యువకులు తెలిపారు

## మామిళ్ళపల్లి క్లస్టర్ జిపిఓగా కల్లేపల్లి రాము



**ఉప్పునుంతల, సూర్య న్యూస్:** మామిళ్ళపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో నూతన గ్రామ పరిపాలన అధికారి ( జిపిఓ )గా కల్లేపల్లి రాము సోమవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. జిపిఓగా మామిళ్ళపల్లి క్లస్టర్ పరిధిలోని మామిళ్ళపల్లి, దాసర్లపల్లి, లక్ష్మాపూర్ గ్రామాలకు సేవలు అందించనున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు స్వాగతం పలుకుతూ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనరసింహ దేవస్థానం మామిళ్ళపల్లి డైరెక్టర్ చలమల గణేష్ గౌడ్, మాజీ సర్పంచ్ దామోదర్, మాజీ ఉపసర్పంచ్ మోహన్ గౌడ్, అర్జున్ రావు, బాలురావు, పానం సైదులు, జరుపటి సత్యం, జరుపటి సుదర్శన్, దుడ్డు సాయిబాబు, గద్దె జానయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**కల్వకుర్తి సూర్య న్యూస్.** కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆస్పత్రి సూపర్‌ఇండెంట్ డాక్టర్ శివరాం ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ముందుగా ఆసుపత్రిలో దుర్గమ్మతల్లి చిత్రపటానికి పూలమాలవేసి ఆస్పత్రిలోని సామాగ్రికి ఆయుధ పూజలు నిర్వహించారు, ఆసుపత్రిలోని వైద్యులు, సిబ్బంది బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. ఆటపాటలతో పని ఒత్తిడికి నుంచి విముక్తి కలిగే విధంగా ఈ కార్యక్రమాలు తోడ్పడుతున్నాయని ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ శివరాం తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు యశోద, సిబ్బంది ఉన్నారు.

## సూర్యచంద్ర పౌండేషన్ అధినేత ఎస్ సూర్య మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో బహుమతులు ప్రధానం



**మరికల్ సూర్య న్యూస్:** మరికల్ మండలం పెద్ద చింతకుంట గ్రామంలో దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సూర్య చంద్ర ఫౌండేషన్ అధినేత ఎస్ సూర్య మోహన్ రెడ్డి అమ్మవారినీ మంటపం సందర్శించి తీర్థ ప్రసాదంలు స్వీకరించారు. అనంతరం జరిగిన బతుకమ్మ పండుగ సందర్భంగా వివిధ రకాల పోటీలను నిర్వహించగా అందులో గెలుపొందిన వారికి సూర్యచంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులను బహుకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించినటువంటి పోటీలను గెలుపొందిన వారికి శుభాకాంక్షలు తెలుపుతూ దుర్గమ్మ ఆశీస్సులు గ్రామంలో గల ప్రతి ఒక్కరికి ఉండాలని కోరుకుంటున్నాను అన్నారు.అనంతరం గ్రామ ప్రజలు సన్మాన కార్యక్రమం నిర్వహించి ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కిషోర బాలికల వ్యక్తిగత పరిశుభ్రత మరియు న్యూట్రిషన్ ఆహార భద్రత మరియు ఆరోగ్యం



**ధరూర్ మేజర్‌న్యూస్:** మండల కేంద్రంలో దసర సెలవుల ముగింపు సందర్భంగా కిశోర బాలికలకు ఆటల పోటీలు నిర్వహించడం జరిగింది మానసిక ఆరోగ్య కోసం ఆటలు చాలా అవసరం అని ఏపీఎం నరహరి చెప్పడం జరిగింది.కిషోర బాలికల వ్యక్తిగత పరిశుభ్రత మరియు న్యూట్రిషన్ ఆహారం తీసుకోవలి భద్రత మరియు ఆరోగ్యం గురించి చర్చించికోవడం కోసం పభుత్వం స్నేహ బాలికల సమావేశం ఏర్పాటు చేస్తున్నాం అని చెప్పడం జరిగింది ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ తిరుపతి రెడ్డి,మండల సమాఖ్య కార్యదర్శి ఖాజాబీ,సీసీలు నవీన్, నాగ్య నాయక్, రాములు, శ్రీనిధి మేనేజర్ రషీద్, విఓఏ పద్మ, రుతమ్మ మరియూ మహిళ సంఘము సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ మహిషాసుర మర్దిని హెూమము



**నారాయణపేట జిల్లాప్రతిని ధి సూర్యన్యూస్:** నారాయణపేట జిల్లా కేంద్రము లోని శ్రీ సంత్ మఠ మూల మహా సంస్థానం శక్తి పీఠంలో శ్రీ దేవి శరన్న వరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా 10వ రోజు బుధవా రం శ్రీ మహి షాసుర మర్దిని దేవి హెూమ మును ఘనంగా నిర్వహిం చారు.పూజా కార్యక్రమంలో మాధురి ధరక్, హనుమాన్ ధరక్ దంపతులు, ప్రముఖ తెలుగు సీరియల్ నటిసిరి పాల్గొన్నా రు.తదనంతరం అమ్మవారికి మహానివేదన సమర్పణచేసి, మహా మంగళ హారతి చేశారు.ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు.

## దసరా శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నరసింహులు



**మల్దకల్ సూర్య న్యూస్:** చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రత్యేకత నిలిచే పండుగ విజయదశమి (దసరా) అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నరసింహులు అన్నారు. ఈ సందర్భంగా ఓ ప్రకటన ద్వారా తన నివాసం నుంచి తెలియజేస్తూ మండల ప్రజలందరూ పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ముందుగా మండల ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో బాగుండాలని కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

## సరఫ్ బజారులోఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



**నారాయణపేట జిల్లా ప్రతినిధి సూర్య న్యూస్:** శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక సరాఫ్ బజార్ బసవేశ్వర మందిరంలో మంగళవా రం రాత్రి ఎంతో అంగా రంగా వైభవంగా నవరాత్రి ఉత్సవాలు జరగడం జరిగింది ముఖ్యంగా సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించాయి ఇట్టి కార్యక్రమానికి డాక్టర్ మధన్ మోహన్ రెడ్డి అధ్యక్షత వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇట్టి కార్యక్రమానికి విచ్చేసి, విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు

## భవానీ మందిర్‌లో ఘనంగా ఆయుధ పూజ



**నారాయణపేట జిల్లా ప్రతినిధి సూర్య న్యూస్ :** నారాయణపేట జిల్లా కేంద్రం దూల్ పేట అంబా భవానీ మందిరంలో దేవీనవరాత్రి వేడుకలలో భాగంగా బుధవారం ఆయుధ పూజ ను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.ఈ వేడుకల్లో ఉత్సవ సమితి అధ్యక్షుడు భీంచందర్ గౌడ్,కార్యదర్శి మిర్చి వెంకటయ్య,మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందు నామాజీ,సభ్యులు రఘువీర్ యాదవ్,శివకుమార్, ఆషప్ప,నిర్వాహకులు పాల్గొన్నారు.

## విజయదశమి విజయానికి, ధైర్యానికి ప్రతీక

### - జిల్లా ప్రజలకు దసరా పండగ శుభాకాంక్షలు కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్ కర్నూల్, మేజర్ న్యూస్:** నాగర్కర్నూల్ జిల్లా ఎన్నికల అధికారి%ఙ% కలెక్టర్ బాదావత్ సంతోష్, విజయదశమి (దసరా) పండగ విజయానికి, ధైర్యానికి ప్రతీకఅని... ఎప్పటికైనా మంచికే విజయం వరిస్తుందని తెలియజేసేం దుకు ఈ పండగ నిదర్శమని నాగర్కర్నూల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. దసరా పండగ సందర్భంగా జిల్లా ప్రజలకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఆయన ప్రత్యేకంగా శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ విజయదశమి (దసరా) విజయం, ధైర్యంతో పాటు మంచితనానికి ప్రతీకగా పాండవులు వనవాసానికి వెళ్ళి విజయం సాధించినట్లుగా గతంలో పురాణాల్లో నిలవగా... ప్రస్తుతం కూడా ఎప్పటికైనా మంచినే విజయం వరిస్తుందని తెలియజేస్తోందని కలెక్టర్ సంతోష్ పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతి కుటుంబం, గ్రామం, పట్టణాల్లో భక్తి, ఐకమత్యం, సంప్రదాయ విలువలతో పండగను చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

## పెద్దమందడిలో పోచమ్మ గుడి నిర్మాణానికి రూ : 5 లక్షలు మంజూరు చేసిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

### - గుడి నిర్మాణ పనులు ప్రారంభించిన గ్రామస్తులు



**పెద్దమందడి సూర్య న్యూస్:** పెద్దమందడి మండల కేంద్రంలో పోచమ్మ గుడి నిర్మాణ కొరకు ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి రూ:5 లక్షలు మంజూరు చేశారు.గత 15 రోజుల క్రితం ఐదు లక్షల రూపాయలను పోచమ్మ గుడి కొరకై శాంక్షన్ చేసినట్లు గ్రామస్తులు తెలిపారు . గుడి నిర్మాణన్నీ బుధవారం ముగ్గు పోసిన పెద్దమందడి గ్రామ పెద్దలు, నాయకులు పనులు ప్రారంభించారు ఈ కార్యక్రమంలో కొత్తకోట ప్రవీణ్ కుమార్, అయ్యా మరియు మేస్త్రి గోపాల్ సాగర్, సత్య రెడ్డి, మాజీ ఎస్ఎంసి చైర్మన్ టైలర్ రవి, సుగుర్ రాఘవేందర్, బోయిని నాగన్న యాదవ్, చిన్న మన్యం, ధర్మారెడ్డి, బొందల కృష్ణయ్య గ్రామ పెద్దలు తదితరులు పాల్గొనడం జరిగింది.

## జగన్మాత మహిషాసుర మర్దిని దేవి కృప కటాక్షం అందరిపై ఉండాలి

- ఆకాంక్షించిన దేవునిగుట్ట తండా మాజీ సర్పంచ్ రాములు నాయక్
- కార్యక్రమానికి హాజరైన జడ్చర్ల మున్సిపాలిటీ చైర్మన్, కౌన్సిలర్లు



**బాలానగర్ సూర్య :** జగన్మాత మహిషాసుర మర్దిని దేవి కృప కటాక్షం అందరిపై ఉండాలని ఆకాంక్షించినట్లు దేనిగుట్ట తండా మాజీ సర్పంచ్ రాములు నాయక్ పేర్కొన్నారు. దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా జడ్చర్ల మండల పరిధిలోని దేవునిగుట్ట తండా సమీపంలో ఉన్న శ్రీగిరి అష్టలక్ష్మి క్షేత్రములో బుధవారం మహిషాసుర మద్దినీ దేవి అవతారము అలంకారములో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా చక్ర అభిషేకము కుంకుమార్చన చండీ హోమము జరిగింది. ఈ పవిత్రమైన కార్యక్రమంలో దేవుని గుట్ట మాజీ సర్పంచ్ రాములు నాయక్ దంపతులు, వారి కుటుంబ సభ్యులు, వెంకటర మణ విజయలక్ష్మి, కుటుంబ సభ్యులు, శ్రీధర్ ఆవుపా అధ్యక్షులు జడ్చర్ల కుటుంబ సభ్యులు హోమంలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం కూడా విశేషంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్చర్ల స్థానిక చైర్మన్ పుష్పలతమ్మ, వార్డు కౌన్సిలర్ జ్యోతి కృష్ణారెడ్డి, నాయకులు యాది రెడ్డి, రామచంద్రారెడ్డి, ఉమ్మెత్తల మహేశ్వరి, వెంకటేశం, సవితమ్మ, బుక్క నారాయణ తదితరులు పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలన్నీ ఆచార్య కృష్ణానంద స్వామి ఆశ్రమ అధ్యక్షులుగా వారి ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు.

విజయదశమి శుభాకాంక్షలు
ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు
SVS హాస్పిటల్, మహబూబ్‌నగర్
Management, SVS Group of Institutions
MAHABUBNAGAR

## మహిషాసుర మర్ధిని దేవి అలంకరణతో అమ్మవారు దర్శనం







**కల్వకుర్తి మేజర్ న్యూస్.** కల్వకుర్తి పట్టణంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవి దేవాలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం 10వ రోజు అమ్మవారు మహిషాసుర మర్దిని అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం సుప్రభాత సేవ అభిషేకాలు దంపతలచే కుంకుమార్చన, భగవద్గీత, విష్ణు సహస్రనామ పారాయణం, చండీ మహా హోమం నిర్వహించినట్లు దేవాలయం చైర్మన్ పౌండర్ ట్రస్టీ జూలూరి రమేష్ బాబు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గందె రవి లు తెలిపారు. నవరాత్రుల సందర్భంగా జిల్లా పౌరసరఫరాల అధికారులు డిఎస్ ఓ నర్సింగ్ రావు, డిఎం రాజేందర్ , ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేంద్ర ర్ రెడ్డి లు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయం చైర్మన్ పౌండర్ ట్రస్టీ జూలూరి రమేష్ బాబు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గందె రవి, ఉత్సవ కమిటీ సభ్యులు శాలువా మెమెంటో తో సన్మానం చేశారు. హిందూ ఐక్య వేదిక సంఘం సభ్యులు దసర పండుగ గురించి, హిందూ సంస్కృతి సంప్రదాయాల గురించి అవగాహన కల్పించారు. సాంప్రదాయ బద్ధంగా దుస్తులు అలంకారంతో దేవాలయానికి వచ్చిన మహిళల కు బహుమతులు దాత రాచూరు రాంమోహన్ సహకారంతో అందజేశారు. ఆదే విధంగా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారి కి బంగారు కిరీటం కోసం దొంతు రాంమోహన్ తులం బంగారం,గుండ మధుసూధన్ అర్థ తులం బంగారం ఇవ్వడం జరిగింది, వారిని దేవాలయం చైర్మన్ పౌండర్ ట్రస్టీ జూలూరి రమేష్ బాబు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గందె రవి ఉత్సవ కమిటీ సభ్యులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఆనతరం పెద్ద మంగళ హారతి దాతల సహకారంతో భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేశారు. సాయంత్రం కోలాటాలు దాండియా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయం చైర్మన్ పౌండర్ ట్రస్టీ జూలూరి రమేష్ బాబు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గందె రవి, ఉత్సవ కమిటీ సలహాదారు వాస శేఖర్, కమిటీ ప్రధాన కార్యదర్శులు గుండ్ల రేవంత్, డి, నితిన్, కోశాధికారి లు పోల గిరిబాబు, సంబ తరుణ్ లు ఆర్యవైశ్య సంఘం నాయకులు, సభ్యులు, అనుబంధ సంఘాల నాయకులు సభ్యులు,మహిళలలు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీటీసీ, జడ్పిటిసి, గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల నిర్వహణకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలి

### - జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి



**మహబూబ్‌నగర్, సూర్యప్రతినిధి:** జిల్లాలో జరగబోయే ఎం.పి.టి.సి జడ్.పి.టి.సి గ్రామపంచాయతీ సర్పంచ్, ఎన్నికల నిర్వహణకు జిల్లాలోని అన్నిరాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించి, సహకరించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి కోరారు, బుధవారం కలెక్టరేట్ వి.సి.కాన్ఫరెన్స్ హాల్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోయే ఎన్నికలలో ప్రతి ఒక్కరూ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, (ఎన్నికల నియమావళి)ని పాటిస్తూ ఎన్నికలు సజావుగా నిర్వహణకు సహకరించాలన్నారు, జిల్లాలో జడ్.పి.టి.సి, ఎం.పి.టి.సి,రెండు విడతల్లో, గ్రామ పంచాయతీ మూడు విడతల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనలకు సంబంధించి తీసుకోవలసిన చర్యలు, నామినేషన్ల ప్రక్రియ, స్క్రూటినీ, ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థుల వ్యయ పరిమితి ఎన్నికలు నిబంధనలు తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్‌కు వివరించారు ఫ్లయింగ్ స్క్వాడ్స్, ఎస్ఎస్‌టిలను నియమించినట్లు తెలిపారు ఎన్నికల కమిషన్ సూచించిన ప్రకారం జిల్లాలో ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు, ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జడ్.పి.సి.ఈ.ఓ, వెంకటరెడ్డి, డి.పి.ఓ పార్థ సారథి,ఆర్.డి.ఓ నవీన్, రాజకీయ పార్టీల ప్రతినిధుల, తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ మెన్స్ ఫుట్బాల్ ఛాంపియన్షిప్ విన్నర్స్‌ని అభినందించిన కలెక్టర్



**వనపర్తి టౌన్ సూర్య:** మహబూబ్నగర్ జిల్లాలో జరిగిన సీనియర్ మెన్స్ ఫుట్బాల్ %జష్ట్రుఎజూఅశీఅంష్ట్రఱజూ% లో %ఔ×చీచీజు=ా% గా నిలిచి %ఒతీశీజూష్ట్రఎ% ని కైవసం చేసుకున్న వనపర్తి జిల్లా జట్టును వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి క్రీడాకారులను మరియు డిస్ట్రిక్ట్ ఫుట్బాల్ అసోసియేషన్ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో %ణూా% సుధీర్ కుమార్ రెడ్డి జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ కృష్ణ కుమార్ రెడ్డి ఉపాధ్యక్షులు సురేందర్ రెడ్డి, వెంకట్ ప్రధాన కార్యదర్శి నందిమల్ల తిరుపతి, కోశాధికారి అప్సర్, కోచ్ రాజేందర్ మరియు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను
సంచలన దినపత్రికగా పేరొందిన నేటి దినపత్రిక సూర్య లో
పనిచేసేందుకు ఆసక్తి కలిగిన విద్యావంతులకు, విలేకరులకు
మహబూబ్‌నగర్ జిల్లా : హన్వాడ, భూత్పూర్, కౌకుంట్ల, మిడ్జిల్, జడ్చర్ల, రాజాపూర్, మూసాపేట
వనపర్తి జిల్లా : వనపర్తి, రూరల్, కొత్తకోట, అమరచింత, పాన్‌గల్, ఖిల్లఘణపురం,
నాగర్‌కర్నూల్ జిల్లా : బల్మూర్, మన్ననూర్, కొల్లాపూర్, పెంట్లవెల్లి, తాడూరు, తిమ్మాజిపేట, అమ్రాబాద్
జోగులాంబగద్వాల జిల్లా : ఇటిక్యాల, ఎర్రవల్లి, ఉండవెల్లి, వడ్డేపల్లి, గట్టు
ఏరియాల్లో అవకాశం కల్పిస్తోంది.
సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును.
ఆసక్తి కలిగిన వారు సంప్రదించాల్సిన నెంబరు
8008622757